
సాక్షి తిరుపతి

మంగళవారం, 23, ఏప్రిల్, 2024



ప్రాచీన ఆహారంతో..

ప్రాచీన సంప్రదాయ ఆహార పద్ధతులతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వనం ప్రసాద్ పేర్కొన్నారు. - 8లో



ప్రమాదంలో యువకుడి మృతి

ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. - 8లో



మీ బిడ్డగా సేవ చేస్తా

'మీ ఓటుతో ఆశీర్వదిస్తే.. మీ బిడ్డగా సేవ చేస్తా'నని తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

24 వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 24వ తేది వరకు గడువు పెంచినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉద్యోగులకు ఏ మండలంలో ఓటు ఉందో ఆ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తును ఫారం-12ను సమర్పించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,366 మంది స్వామివారిని దర్శించుకోగా.. 24,375 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.38 కోట్లు మర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నాల్గో రోజు 46 నామినేషన్లు

తిరుపతి అర్బన్: నామినేషన్ల జోరు పెరుగుతోంది. తిరుపతి జిల్లాలో నాల్గో రోజు సోమవారం 46 మంది నామినేషన్లు వేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నామినేషన్లకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఆర్వో కార్యాలయాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

తెప్పపై శ్రీరామచంద్రమూర్తి కటాక్షం



తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని వేడుకగా చేపట్టారు. సాయంత్రం శ్రీసీతా రామలక్ష్మణులు ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీరామచంద్రపుష్కరిణి చేరుకున్నారు. అనంతరం విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

రామచంద్రాపురం: కొత్తకండ్రిగ, కమ్మపల్లి, వెంకట్రామాపురాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ వద్ద కేంద్రం వద్ద సాయుధ బలగాలతో అదనంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భాస్కర్‌రెడ్డి, శరత్‌కుమార్, సీఐలు శ్రీనివాసులు, రామయ్య, స్థానిక ఎస్‌ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆనందం పదింతలు



విద్యార్థిని లక్ష్మీప్రియ, తల్లి నిర్మలను సత్కరిస్తున్న ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, హెచ్‌ఎం బృందాదేవి

సరైన వసతులు, పౌష్టికాహారం, ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన అందిస్తే ఎంతటి కష్టాన్నైనా అవలీలగా సాధించొచ్చని నిరూపించారు.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. సోమవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. కార్పొరేట్‌కు దీటుగా అత్యధిక మార్కులు సాధించి సత్తాచాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరినీ ఆనందంలో ముంచెత్తారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఉత్తమ విద్యాబోధనే తమ పిల్లల భవితకు బంగారు బాటలు వేశాయని తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. మున్ముందు మరిన్ని వసతులు కల్పించి, పిల్లలకు అండగా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు.

పది ఫలితాల్లో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో పదో స్థానం

- బాలికలదే పైచేయి
- విశేష ప్రతిభ కనబరిచిన పేదింటి విద్యాకుసుమాలు
- మెరుగైన వసతులు, అత్యుత్తమ బోధనతోనే సాధ్యమైందంటున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా 91.96శాతం ఉత్తీర్ణతతో బాలికలు పై చేయి సాధించారు. నూతన జిల్లాల ప్రాతిపదికన పదో తరగతి పబ్లిక్ పరీక్షలను 2022-23 విద్యాసంవత్సరం నుంచి నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఫలితాలో జిల్లా 75.70శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానం కైవసం చేసుకుంది. ఈ ఏడాది ఫలితాల్లో 90.71శాతం ఉత్తీర్ణతతో పదో స్థానాన్ని చేజిక్కించుకుంది. తిరుపతి జిల్లాలోని 34 మండలాల పరిధిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు 162 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షలకు బాలురు 13,997 మంది, బాలికలు 12,628 మంది, మొత్తం 26,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 12,538 (89.58శాతం) మంది, బాలికలు 11,613 (91.96శాతం) మంది, మొత్తం 24,151 (90.71 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ప్రభంజనం

ప్రభుత్వ ఆశయాలను విద్యాశాఖ అమలుచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖాధికారులు ప్రణాళికలు రూపొందించి పటిష్టంగా అమలుచేయడంతో ఈ ఏడాది అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా కార్పొరేట్‌కు పోటీగా అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు.

అత్యుత్తమ ప్రతిభ

ఈ ఏడాది పది ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యధిక మంది ఉత్తమ మార్కులు సాధించి విజయఢంకా మోగించారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 26,625 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా.. వీరిలో 20,161 మంది ప్రథమ శ్రేణి, 2,694 మంది ద్వితీయ శ్రేణి, 1,296 మంది తృతీయ శ్రేణి, మొత్తం 24,151 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఉత్తీర్ణతా శాతం

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు

హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణతా శాతం
15,553	13,257	85.24శాతం

అన్ని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు

హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణతా శాతం
11,072	18,894	98.39శాతం

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు

యాజమాన్యం	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	ఉత్తీర్ణతా శాతం
ఏపీ మోడల్	378	363	96.03
ఏపీఆర్‌ఈఎస్	162	160	98.77
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్	819	783	95.60
ఏపీటీడబ్ల్యూఆర్	443	372	83.97
కేజీబీవీ	183	157	85.79
ఎంజేపీఏపీబీసీఆర్	406	405	99.75
మున్సిపల్	980	796	81.22
ప్రైవేట్ ఎయిడెడ్	716	650	90.78
ప్రభుత్వ పాఠశాలలు	806	663	82.26
జిల్లా పరిషత్	10,660	8,908	83.56

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు, రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 23 నుంచి 30వ తేదీలోపు లేట్ ఫీ లేకుండా, అలాగే మే 1నుంచి 23వ తేదీలోపు లేట్ ఫీజుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. రీ-కౌంటింగ్‌కు రూ.500, రీ-వెరిఫికేషన్‌కు రూ.1,000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్

- పది ఫలితాల్లో శ్రీకాళహస్తి విద్యార్థిని ప్రతిభ
- 596 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన లక్ష్మీప్రియ

శ్రీకాళహస్తి : పదోతరగతి ఫలితాల్లో శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ మున్సిపల్ పాఠశాల విద్యార్థిని 596 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచింది. శ్రీకాళహస్తి జయరాంరావు వీధి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లక్ష్మీప్రియ 596/600 సాధించింది. ఈ పాఠశాల నాడు-నేడు కింద ఎంపిక కావడంతో మౌలిక వసతులు కార్పొరేట్‌ను తలదన్నేలా ఉండడం, ఐఎఫ్‌పీల ద్వారా ఈ-కంటెంట్ బోధన, జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం అందించడం, రాగిజావ, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి కింద నగదు అందించడం, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ వంటి సదుపాయాలు ఉండడంతో లక్ష్మీప్రియను జిల్లా టాపర్‌గా నిలిపేందుకు ఎంతగానో సహకరించాయి. ఈ సందర్భంగా విద్యార్థిని లక్ష్మీప్రియ, ఆమె తల్లి నిర్మలను పాఠశాల ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి, ఉపాధ్యాయులు సత్కరించి, అభినందించారు. ఇదే తరహాలో జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం విశేషం.

ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య

"మా కుమార్తె లక్ష్మీప్రియ ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాల్లోనే చదువుతోంది. గత ఐదేళ్లలో కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దీనికి తోడు ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించడంతో నా కుమార్తె 596 మార్కులు సాధించి జిల్లాలోనే టాపర్‌గా నిలవడం చాలా ఆనందంగా ఉంది.

– కె. నిర్మల, విద్యార్థిని తల్లి, శ్రీకాళహస్తి

జిల్లాలో అత్యధిక మార్కులు

విద్యార్థి పేరు	పాఠశాల	మండలం	మార్కులు
కటుబోయిన లక్ష్మీప్రియ	ఎస్‌ఎస్‌బీ, మున్సిపల్ హైస్కూల్	శ్రీకాళహస్తి	596
కుర్ర పాంచజన్య	ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ బాయ్స్‌స్కూల్	దొరవారిసత్రం	595
తుళ్లూరు పవన్	ఎంయూపీఏపీ బీసీడబ్ల్యూఆర్ బాయ్స్‌స్కూల్	కోట	593
బందారుపల్లి జనని	జెడ్పీహైస్కూల్, బందారుపల్లి	ఏర్పేడు	592
నసిన సాయికిషోర్	జెడ్పీపీ హైస్కూల్, మెనకూరు	నాయుడుపేట	591
కే.చారుమతి	ఏపీ మోడల్ స్కూల్	కేవీబీపురం	590
రామ ఎస్.కస్తూరి	జెడ్పీబాలికల హైస్కూల్	నారాయణవనం	590
గంగల యోగేష్	జెడ్పీ హైస్కూల్, తొండమనాడు	శ్రీకాళహస్తి	590
గంగూరి లక్ష్మి	మున్సిపల్ హైస్కూల్, ఆర్‌ఎస్‌మాడవీధి	తిరుపతి అర్బన్	590
ఏహెచ్.తౌఫిక	జెడ్పీ బాలికల హైస్కూల్	నారాయణవనం	589
చెన్నంపల్లి అభిలాష్	జెడ్పీహైస్కూల్, తొండమనాడు	శ్రీకాళహస్తి	589
కాశి తులసి	ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ జీఎస్ కాసగార్డెన్	శ్రీకాళహస్తి	589
శ్రీకైగారి తరుణ్‌కుమార్	ఎస్వీ హైస్కూల్	తిరుపతి అర్బన్	589
బైని పల్లవి	జెడ్పీ హైస్కూల్	వరదయ్యపాళెం	589
కనింబాకం మునికుమార్	జెడ్పీ హైస్కూల్, వల్లివేడు	వెంకటగిరి	589

సీఎం నిర్ణయంతోనే మంచి చదువు



"మా అబ్బాయి రెడ్డి జయవర్దన్ తిరుపతి నగరంలోని కంభవానిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. పదో తరగతి ఫలితాల్లో 572/600 మార్కులతో స్కూల్‌టాపర్‌గా నిలిచారు. కోవిడ్ మహమ్మారితో నా భర్త 2020లో మృతి చెందాడు. బాడుగ రేకుల ఇంట్లో నివసిస్తున్నాము. ప్రభుత్వ పింఛన్‌తో పాటు అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలు మా కుటుంబాన్ని ఆదుకున్నాయి. మా పిల్లలు మంచి చదువులు చదవడానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో ఉంది.

– రమణమ్మ, రెడ్డిజయవర్దన్ తల్లి, తిరుపతి

ఇంటి పట్టాల బాధ్యత నాదే

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి అండగా నిలవండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన



స్థానికుడు ఆటో గణేష్‌తో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి సిటీ: 'తిరుపతి నగరంలో 7,500 మంది టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే. టీటీడీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తున్న 22వేల మంది ఉద్యోగులకు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు జీతాలు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదేనని చెప్పడానికి గర్విస్తున్నా. తిరుపతిలో నివసిస్తున్న సామాన్య పేద ప్రజలకు ఇప్పటి వరకు 26 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారందరికీ ఇంటి పట్టాలు ఇచ్చే బాధ్యత నేనే తీసుకుంటా. అభివృద్ధే అజెండాగా.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలా, బూటకపు మాటలు చెబుతున్న గాజు గ్లాసు వాళ్లకు ఓట్లు వేయాలా..? ప్రజలే ఆలోచించుకోండి' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మల్లయ్యగుంటకట్ట ప్రాంతంలో మేయర్ డాక్టర్ శిరీషతో కలసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమి తాము గెలిస్తే ప్రజలకు ఏమి చేస్తామనే మాటలు మరచి వైఎస్సార్‌సీపీ నాయకులపై వ్యక్తిగతంగా రెచ్చగొట్టే వ్యాఖలు చేస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన మేలు, మంచి పనులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామని తెలిపారు.

70 ఏళ్ల సమస్యకు పరిష్కారం

నగరంలో సుమారు 5వేల కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లకు 70 ఏళ్లుగా రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదని తమ దృష్టికి రాగానే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించామని భూమన తెలిపారు. గంగమ్మ గుడి ఆలయ అనుసంధానం రోడ్డుతో పాటు తిరుపతిలో 18 మాస్టర్ ప్లాన్‌రోడ్లు నిర్మించామని చెప్పారు. తిరుపతిలో సుమారు 7,500 ఎకరాలను నివాసయోగ్యమైన ప్రాంతాలుగా మార్చినట్టు పేర్కొన్నారు. ఒక్క తిరుపతిలోనే సీఎం జగన్ సుమారు రూ.1,900 కోట్లు ఆర్థిక సాయం చేసినట్టు వెల్లడించారు. ఇన్ని మంచి పనులు కళ్లారా చూస్తున్నారని, మీకు మేలు జరిగి ఉంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు.

చదివించే బాధ్యత నాదే!

మల్లయ్యగుంట వీధిలో ఆటో గణేష్‌ను పలకరించగా ఆయన తన కుమార్తె చదువు విషయమై ఎమ్మెల్యేకి వివరించారు. డిగ్రీ చదువుతున్న గణేష్ కుమార్తె భువనేశ్వరిని తన సొంత ఖర్చులతో హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఐఏఎస్ కోచింగ్ ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రమణ్యంను పరామర్శించారు. జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. తిరుపతి మరింత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమన అభినయ్‌కి, పార్లమెంట్ అభ్యర్థి గురుమూర్తికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, చింతా భరణీ యాదవ్, జెల్లి తులసీ యాదవ్, ముని శేఖర్ రాయల్, సురేష్ యాదవ్, చింతా రమేష్ యాదవ్, భాషా, గజేంద్ర, అక్కుపల్లి కల్పన యాదవ్, శివా పాల్గొన్నారు

చెక్‌లిస్ట్ పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: డ్యూటీలోని ఉద్యోగులు ఎన్నికల ఏర్పాట్లను సీరియస్‌గా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా నోడల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈవీఎంల చెక్‌లిస్ట్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. మే 1న ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ చేపట్టాలని చెప్పారు. పీవో, ఏపీవోలకు శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. ఎపిక్ కార్డుల పంపిణీ పెండింగ్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదన్నారు. తడ మండల పరిధిలోని ఇరకం దీవిలో కమ్యూనికేషన్ సక్రమంగా ఉండడానికి ప్రణాళికలు చేపట్టాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈసారీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనమే

- 14 ఏళ్లలో చంద్రబాబు చేసిందేమీలేదు
- ఓటు హక్కుతో టీడీపీకి గుణపాఠం తప్పదు
- ముమ్మరంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రచారం

వెంకటగిరి(సైదాపురం): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతోందని తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయనతో పాటు తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు, సిద్ధవరం, కొత్తూరు, బాలసముద్రం, చింతగుంట, కలపాడు, గుండ్లసముద్రం, విశ్వనాథపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉండిన చంద్రబాబు ప్రజలకు చేసిన ఒక్క మంచి పని కూడా చెప్పుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. జన్మభూమి కమిటీ కనుసన్నల్లో సంక్షేమ పథకాలు వారి అనుయాయులకే అందించారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీలతో ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసిన మొనగాడు జగన్ అని పేర్కొన్నారు.

పేదల దేవుడు జగన్

తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనతి కాలంలో పేదల దేవుడిగా కీర్తిగడించారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అంతేగాకుండా ప్రజలకు అతిచేరువలో పాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదలకు ఇటువంటి మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పరిశీలకులు ఎమ్మార్సీరెడ్డి, నియోకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయ్యరెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు తంబిరెడ్డి శివారెడ్డి, సదారెడ్డి, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, ఎంపీటీసీ సభ్యులు పుల్లూరు శ్రీదేవి, సర్పంచ్‌లు అమ్ములు, కాలే చెంచు ప్రసన్నకుమార్, ప్రసాద్, నాయకులు ఆవుల గిరియాదవ్, సిద్ధవరం కుమార్, శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, సాయిరాంరెడ్డి, పంజాం ధనంజయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, రామ్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

సంప్రదాయ ఆహార పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం

చంద్రగిరి: ప్రాచీన సంప్రదాయ ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతివనం ప్రసాద్ అన్నారు. శ్రీసాయినాథ్ నగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో సోమవారం సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యకరమైన వంటకాలు, ఉత్పత్తులు అనే అంశంపై మదనపల్లెకు చెందిన ప్రకృతివనం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీసీ ప్రొఫెసర్ నాగరాజ రామారావు అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, రిజిస్ట్రార్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రేపు విశ్వంలో ఏపీఆర్‌జేసీ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ఏపీఆర్‌జేసీ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్ ఉచితంగా నిర్వహించనున్నట్టు విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 25న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 86888 88802 / 93999 76999లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదంలో యువకుడి మృతి

తిరుపతి రూరల్: ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వెనుకవైపు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు.. తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట అంబేడ్కర్ కాలనీకి చెందిన దిలీప్(32) బైక్‌పై రామానుజపల్లి సర్కిల్ నుంచి వేదాంతపురం సర్కిల్ వైపు వస్తున్నాడు. బాలాజీ డెయిరీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి దాన్ని వెనుక వైపు ఢీకొట్టి కిందపడ్డాడు. డివైడర్‌కు తల బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.


'ఆరణి' అక్రమాలు..!

ప్రజాధనానికి జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే అయినప్పటికీ ఎక్కడ అవకాశముంటే అక్కడ అవినీతికి తెరతీసేస్తారు.. కంచే చేను మేసినట్టు ఖాళీ భూమి కనిపిస్తే కబ్జా చేసేస్తారు.. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టేస్తారు.. బాబాయ్ పదవిని అడ్డుపెట్టుకుని అబ్బాయ్ అక్రమాలకు పాల్పడతారు.. అన్న కుమారుడి క్రిమినల్ ఆలోచనలను సదరు ప్రజాప్రతినిధి తూచా తప్పకుండా అమలు చేసేస్తారు.. జేబులోని రూపాయి తీయరు.. యథేచ్ఛగా ఊరి మీద పడి దోచుకున్నారు.. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారు.. చివరకు చిత్తూరును సొంతం దిగమింగేశారు.. తమ అక్రమార్జనను కొనసాగించేందుకు కొత్తగా తిరుపతిని ఎంచుకున్నారు. దీంతో తిరునగరి వాసులు అప్రమత్తంగా ఉండాలని బాధితులు హెచ్చరిస్తున్నారు.

- అవినీతిలో బాబాయ్.. అబ్బాయ్ పోటాపోటీ
- ఇసుక దందాలో రూ.3 కోట్లకు పైగా స్వాహా
- తమ సిబ్బందికి సైతం ప్రభుత్వ ఖజానా నుంచి రూ.2.81 కోట్ల వేతనాలు
- కోవిడ్ కాలంలో మార్కెట్ గేటుకు రూ.52లక్షల ఎగవేత
- ఫోర్జరీ సంతకాలతో టెండర్ల భాగోతం
- చిత్తూరును సొంతం దిగమింగి.. తిరుపతికి పాకిన అనకొండలు



చిత్తూరు నగరంలోని సీతమ్స్ సమీపంలో అప్పటికే ఉన్న కూసాలను పడగొట్టి.. కబ్జా చేసిన భూమిలో కొత్తగా నాటించిన కూసాలు



చిత్తూరు మునిసిపల్ కమిషనర్‌తో పాటు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన 'ఆరణి'

చిత్తూరు అర్బన్ : ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేయాల్సిన పదవిని 'ఆరణి' తన స్వార్థానికి వినియోగించుకున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూమిని చెరపట్టారు. ఆయన అడుగు జాడల్లోనే వారి అన్న కుమారుడు సైతం భూ దందాలు చేస్తూ రూ.కోట్లకు పడగెత్తాడు. వీరి ఆగడాలను అడ్డుకోవడం ఎవరి తరం కాలేదు. చిత్తూరు 'శ్రీనివాసుడి' అక్రమాలు ఓవైపు .. అబ్బాయ్ క్రిమినల్ ఆలోచనలు చూసి ప్రజలు 'శివ' శివా..! అనుకుంటున్నారు. వీళ్లకు ప్రభుత్వ భూములా...? ప్రైవేటు భూములా అనే తేడాలేదు. తమకు నచ్చిందంటే కబ్జా చేసి కంచెలు వేసేస్తారు. చిత్తూరు బాబాయ్ 'ఆరణి'.. అబ్బాయ్ 'శివ' అవినీతి పర్వంలో కొన్ని..

ఫోర్జరీ మాయలు..!

- కరోనా సమయంలో చిత్తూరు మార్కెట్‌గేటు తన బినామీల పేరిట సొంతం చేసుకున్న 'ఆరణి'.. చిన్నా,చితకా వ్యాపారుల ముక్కుపిండి రూ.కోట్లు వసూలు చేశారు. అయినప్పటికీ కరోనా సమయంలో తాము ఆశించిన నగదు వసూలు కాలేదని, ఈ మొత్తాన్ని మాఫీ చేయాలని అధికారులను అడ్డుపెట్టుకుని కౌన్సిల్‌లో తీర్మానం చేయించారు. ఫలితంగా కార్పొరేషన్ ఖజానాకు రూ.52 లక్షల నష్టం వాటిల్లింది.
- బూత్‌బంగ్లాను తలపించే 'ఆరణి' ఇంట్లో, తన కంపెనీల్లో పనిచేయడానికి కొత్త స్కెచ్ వేశారు. తమ వద్ద పనిచేసే 27 మందిని మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేర్పించారు. సొంత పనులకు వీళ్లను వాడుకుని, కార్పొరేషన్ నుంచి నెలకు రూ.18 వేల చొప్పున వేతనాలు ఇచ్చేలా చక్రం తిప్పారు. ఇలా 27 మందికి 58 నెలల పాటు రూ.2.81 కోట్లను వేతనాల రూపంలో కొల్లగొట్టారు.
- ఇక 2017లో బెంగళూరు గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఓ టెండర్‌లో పాల్గొనేందుకు 'ఆరణి' కంపెనీకి ఏదైనా కార్పొరేషన్‌లో రూ.వంద కోట్లకు పనులు చేసినట్లు ధ్రువీకరణ పత్రం కావాల్సి వచ్చింది. దీనికోసం చిత్తూరులోని ఇరువారం నుంచి గంగినేనిచెరువు వరకు కాలువ పనులు, చెరువుకట్టపై అభివృద్ధి పనులను చేసినట్లు ఓ సర్టిఫికెట్‌ను బెంగళూరు మహానగర పాలక (బీబీఎంపీ) అధికారులకు అందజేశారు. రూ.280 కోట్ల విలువైన ఈ పనుల్లో తాము తొలివిడతగా రూ.19.35 కోట్ల పనులు పూర్తి చేసినట్లు, దీనికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ బిల్లులు కూడా ఇచ్చేసిందని అందులో పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ సంతకాలను ఫోర్జరీ చేసి బీబీఎంపీ టెండర్లలో పాల్గొన్నారు. బెంగళూరు అధికారులకు అనుమానం వచ్చి, దీనిపై చిత్తూరు మున్సిపల్ అధికారులకు లేఖ రాశారు. దీన్ని 'ఆరణి' తొక్కిపెట్టడంతో ఏకంగా బీబీఎంపీ అధికారులు చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయానికి నేరుగా వచ్చి ఇక్కడి అధికారులను సంప్రదించారు. ధ్రువీకరణ పత్రంలోని సంతకాలు తమవి కాదని, అవి ఫోర్జరీ సంతకాలని తేల్చిచెప్పారు. దీంతో 'ఆరణి' కంపెనీపై బీబీఎంపీ అనర్హత వేటువేసింది. అయితే ఇది ఎవరి కంటాపడకుండా 'ఆరణి' వాస్తవాలను తొక్కపెట్టేశారు. ఇన్నాళ్లకు పాపం పండడంతో నిజం వెలుగుచూసింది.
- చిత్తూరు మండలంలో 'ఆరణి' చేసిన ఇసుక దందా అంతా ఇంతాకాదు. తన కంపెనీకు చెందిన భారీ యంత్రాలతో యథేచ్ఛగా ఇసుకను తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మేశారు. ఇలా మూడేళ్ల పాటు సుమారు రూ.3.24 కోట్ల విలువైన ఇసుక అక్రమాలకు పాల్పడ్డారు.

భూ బకాసురుడు..!

చిత్తూరులో ఆరణి చేసిన భూ దందాలనే ఆదర్శంగా తీసుకున్న శివ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. చిత్తూరు భూ బకాసురుడిగా పేరుతెచ్చుకున్న తన బాబాయ్ 'ఆరణి' చేసిన అక్రమాల్లో శివ తనవంతు పాత్రను పోషించాడు.

- గుడిపాల మండలంలోని పానాటూరు వద్ద 22 ఎకరాల ప్రభుత్వ భూమిని తన బంధువుల పేరిట పట్టా ఇప్పించుకున్నాడు. దీనికి ప్రస్తుతం గేటు ఏర్పాటుచేసి పంటలు పండిస్తున్నారు.
- చిత్తూరు–బెంగళూరు బైపాస్ రోడ్డులో సీతమ్స్ కళాశాల సమీపంలో 74–తిమ్మసముద్రం రెవెన్యూ భూముల వద్ద ఓ అనామకుడి నుంచి రూ.కోటి విలువ చేసే భూములను బలవంతంగా లాక్కున్నారు. అసలు పట్టాదారులపై దౌర్జన్యం చేసి మరీ 2,800 అడుగుల భూమిని కబ్జా చేశారు. భూమికి సొంతవాళ్లు ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్‌ను తొలగించి కొత్తగా కూసాలను నాటించేశారు.
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని తన అడ్డాగా మార్చుకున్న 'ఆరణి' అన్నకొడుకు.. ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడిగా తనకు తానే ఓ పదవిని సృష్టించుకున్నాడు. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి రూ.5 లక్షలు, రెవెన్యూ విభాగం నుంచి రూ.2 లక్షలు, ప్రజారోగ్య విభాగం నుంచి రూ.50 వేలు చొప్పున ప్రతీ నెలా మున్సిపల్ అధికారుల నుంచి మామూళ్లను ముక్కుపిండి మరీ వసూలు చేశాడు.

ఇన్ని అక్రమాలుచేసిన 'ఆరణి' తన అన్నకొడుకుతో కలిసి తిరుపతికి మకాం మార్చారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీచేస్తున్న 'ఆరణి' గురించి నిజాలు తెలిసిన తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటి ఘనుడిని అందలం ఎక్కిస్తే తిరుమల శ్రీనివాసుడికే నామాలు పెట్టడం ఖాయమని భయపడుతున్నట్లు సమాచారం.

ఆశీర్వదించండి..మీ బిడ్డగా సేవ చేస్తా!

- ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు
- రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి
- తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- జనవాహినితో మంగళం పంచాయతీలో జోరుగా ఎన్నికల ప్రచారం



బహిరంగ సభలో మాట్లాడుతున్న తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: 'మీ ఓటుతో ఆశీర్వదించండి.. మీ బిడ్డగా సేవ చేస్తా'నని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళం పంచాయతీలో సోమవారం ఆ పంచాయతీ ఇన్‌చార్జ్, అధ్యక్షులు చిలమంద హరికృష్ణ ఆధ్వర్యంలో 'మన ఊరికి.. మన మోహిత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళం ఆర్టీవో కార్యాలయం నుంచి చిలమంద హరికృష్ణ నేతృత్వంలో వందల బైక్‌లతో మంగళం పంచాయతీలోని ప్రతి కాలనీలో యువత భారీ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీలో అడుగడుగునా మహిళలు హారతులు పట్టి, గజమాలలతో సత్కరిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం నారా చంద్రబాబునాయుడు కాలనీలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిర్వహించిన సభకు జనం పోటెత్తారు. జై జగన్, జై మోహిత్‌రెడ్డి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏపీ అగ్రభాగాన కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలని స్పష్టం చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనైనా ఏదైనా ప్రజాప్రయోజన కార్యక్రమం చేపట్టాలంటే.. ముందుగా చంద్రగిరిలో ఎలా చేశారో తెలుసుకొని.. ఇతర ప్రాంతాలలో చేపట్టిన పరిస్థితిని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీసుకొచ్చారని గుర్తుచేశారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రత్యేక నియోజకవర్గంగా తీర్చిదిద్దారని కొనియాడారు. మంగళం పంచాయతీలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.9కోట్లతో అభివృద్ధి పనులు చేసిన ఘనత తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా చంద్రగిరి అసెంబ్లీ నుంచి అవకాశం కల్పిస్తే.. కనీవినీ ఎరుగని రీతిలో చంద్రగిరి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తున్న మోహిత్‌రెడ్డి

మంగళంలో జోరుగా ఎన్నికల ప్రచారం

మంగళంలోని మిట్టగాంధీపురం, మంగళం గ్రామంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపలోనూ మోహిత్‌రెడ్డికి హారతులు పట్టి నీరాజనం పలికారు. అనంతరం మంగళం గ్రామంలో నిర్వహించిన సభలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ 'ఓట్లు వేసి నన్ను ఆశీర్వదించండి.. మీ ఇంటి బిడ్డగా సేవలందిస్తా'నని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి రాంబాబు, ఉప సర్పంచ్ బైరెడ్డి రమేష్, ఎంపీటీసీ లక్ష్మీగణేష్, మంగళం పంచాయతీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, బత్తల గోపి, ఎస్సీసెల్ బాబు, మణి, వెంకటేష్, లక్ష్మయ్య, దినేష్, కన్నయ్య, విజయ, పుష్పరాజ్, బాబ, గిరి, రహీమ్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు బీఎండబ్ల్యూ కారు



వరప్రసాద్‌రావు వెలగపల్లి

తిరుపతి అర్బన్: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా భారతీయ జనతాపార్టీ తరుపున వెలగపల్లి వరప్రసాద్ రావు సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నామినేషన్ వేశారు. ఆయన తన నామినేషన్‌ను ఆర్వోకు అందజేశారు. ఈ సందర్భంగా తాను సమర్పించిన అఫిడవిట్‌లో తనకు బీఎండబ్ల్యూ కారు ఉన్నట్టు పేర్కొన్నారు.

అఫిడవిట్ వివరాలు

అభ్యర్థి– వరప్రసాద్‌రావు వెలగపల్లి
పార్టీ – భారతీయ జనతాపార్టీ
విద్యార్హత –పీహెచ్‌డీ, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం
ఆయన పేరుపై బంగారం– రూ.8వేలు
భార్య వద్ద బంగారం – రూ.27,00,000
ఆయన చేతులో నగదు– రూ.30,545
భార్య చేతిలో నగదు– రూ.4,130
ఆయన పేరుపై చరాస్తులు– రూ.4,55,83,458
భార్య చరాస్తులు – రూ.8,56,67,042
భార్యపై స్థిరాస్తులు –రూ.3,10,48,300
ఆయన అప్పులు –రూ.30,97,323
భార్య అప్పులు –రూ.1,46,86,352
భార్యపై భవనాలు విలువ– రూ.60,00,000
బీఎండబ్ల్యూ కారు– రూ.2,05,03,000
ఆయన పేరుపై బ్యాంక్‌లో నగదు డిపాజిట్లు – రూ.2,02,63,633
ఆయన భార్యపై బ్యాంక్‌లో నగదు డిపాజిట్లు– రూ.10,72,989
కేసులు – లేవు

కలపాడులో వైఎస్సార్‌సీపీ వన్‌సైడ్

- నేదురుమల్లి సమక్షంలో 350 కుటుంబాలు చేరిక



వెంకటగిరి : నేదురుమల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

వెంకటగిరి రూరల్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ దూకుడు పెంచింది. పలువురు కూటమి నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా టీడీపీకి కంచుకోటగా ఉన్న వెంకటగిరి రూరల్ మండలం, కలపాడు పంచాయతీ ఖాళీ అయింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, బీసీ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్, సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో పంచాయతీకి చెందిన సుమారు 350 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, సర్పంచ్ కలపాడు, నాయకులు శివారెడ్డి, నాగరాజు, శ్రీనివాసులరెడ్డి, రాజారెడ్డి, ధనంజయ్య పాల్గొన్నారు.

తిరుచానూరులో సైకిల్‌కు ఎదురు దెబ్బ



వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీటీసీ నరేష్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో వైఎస్సార్‌సీపీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ ఫలాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు పల్లె పల్లెలో విశేష ఆదరణ లభిస్తోంది. మేజర్ పంచాయతీ తిరుచానూరులో సైతం పెద్ద సంఖ్యలో యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం తుమ్మలగుంట నివాసం వద్ద తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన చందు, తరుణ్, రాజు, శశి, రమేష్, క్రాంతి, రాకేష్, సాయి, హేమంత్, ఉదయ్‌తోపాటు మొత్తం 25 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మోహిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారందరీ ఎంపీటీసీ నరేష్‌రెడ్డి పేరు పేరున పరిచయం చేశారు. ఎంపీటీసీ నరేష్, వెంకటేష్, మునీంద్రా, హరి, 6వ వార్డ్ మెంబర్ రవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జోష్



గూడూరు: పార్టీలో చేరిన వారితో మేరిగ మురళీధర్

గూడూరురూరల్: వైఎస్సార్‌సీపీ జోస్ పెరిగింది. దివిపాళెం పంచాయతీలోని అడివి కాలనీ, చవటపాళెం, ప్రాంతాల నుంచి సుమారు 60 కుటుంబాల వారు టీడీపీని వీడి పార్టీ సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ బూదరు గురవయ్య, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌కుమార్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, నక్కా రాజేష్, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్, వెంకటస్వామి, గిల్లయ్య, సురేష్, శ్రీనయ్య, రామనాదం, సాయిరెడ్డి, సురేష్‌రెడ్డి , సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రుణం సొమ్ము కాజేసిన సైబర్ నేరగాళ్లు

శ్రీకాళహస్తి: మాజీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పేరు మీద ఓ ప్రైవేటు బ్యాంక్‌లో రుణం అప్పై చేసి కాజేసిన ఘటన పట్టణంలో సంచలం రేపింది. వివరాలు.. అమరజ్యోతి కల్యాణ మండపం, బాలాజీలైన్‌లో నివసిస్తున్న మాజీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరుణ్‌కుమార్‌కు ఆరోగ్యం సరిలేక ఇంట్లోనే ఉంటున్నాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రైవేటు బ్యాంకు హెడ్ ఆఫీస్ బాంబే నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. బ్యాంక్‌లో మీ వీకేవైసీ, డీటైల్స్ అప్‌డేట్ చేయాలని చెప్పారు. డీటైల్స్ ఇస్తే ఓటీపీ వస్తుందని నమ్మబలికారు. వెంటనే తన పేరుమీద ఆ ప్రైవేటు బ్యాంక్ నుంచి రూ.1,72,219 డిపాజిట్ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. తర్వాత పది నిమిషాలకు రూ.30 వేలు, మరో మూడు నిమిషాలకు రూ.50 వేలు, ఇంకో మూడు నిమిషాలకు రూ.50 వేలు చొప్పున డెబిట్ అయ్యింది. చివరగా రూ.40 వేలు డెబిట్ అయ్యింది. వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. కాగా 7893203985 నంబర్‌తో ఫోన్ కాల్ వచ్చినట్టు బాధితుడు తెలిపారు.